# 5. అమర్ భూపాలి

"నువ్వు పదిరోజుల పనిమీద హైదరాబాద్ వస్తున్నానని రాసిన ఉత్తరం అందిందని సరదాపడ్డాను. కానీ సమంగా ఆ తేదీల్లోనే నేనూ మీ మరదలూ పిల్లలూ ఉత్తర హిందూ దేశ యాత్రలకి వెళ్తున్నాం.

మా ఇంట్లో నువ్వు ఒంటరిగా వుంటానంటే నాకేం అభ్యంతరం లేదు. ఇంటి తాళం చెవులు మా ఆఫీసులో నా సహాధ్యాయి రాజమోహన్ దగ్గర వుంచగలను. కానీ మా ఇల్లు సిటీకి చాలా దూరం. నువ్వు ఉదయాన్నే లేచి పాల "క్యూ"లో నుంచుని ఒక పేకెట్ పాలు తెచ్చుకోగలిగితే కాఫీలకి ఇబ్బంధి వుండదు. వంట చేసుకుంటానంటే ఇంట్లో అన్నీ వున్నాయి. నేనుగాని మా ఇంట్లో వాళ్ళు ఎవరూగాని లేకుండా ఈ అవస్థలు పడలేనూ అనుకుంటే నువ్వు హిమాయత్‌నగర్‌లో (ఫలానా) డోరు నెంబరుగల (ఫలానా) ఇంట్లో మేడమీది భాగంలో వున్న నీ క్లాస్‌మేట్, ఎమ్.ఎల్.ఏ. గారు అయిన లక్ష్మణరావుగారితో వుండొచ్చు.

"ఎమ్.ఎల్.ఏ. క్వార్టర్సులో ఖాళీల్లేకనో మరెందుచేతో ప్రభుత్వంవారు ఆ ఇల్లు అద్దెకి తీసుకుని ఆయనకి ఎలాట్ చేశారు. అసెంబ్లీ సెషన్స్‌లో లేదు కనుక ఆయనకి విజిటర్స్ ఎక్కువమంది వుండరు. ఇంట్లో ఫోన్ వుంటుంది. పైగా నీ పని అంతా సెక్రటేరియట్‌లోనే కనక అక్కడికి దగ్గర. ఆయనకి ఒకరో ఇద్దరో నౌకర్లు వుంటారు. గనక భోజనాలు కాఫీలూ టిఫిన్లూ హొటల్ నుంచి తెప్పించుకోవచ్చును.

"నువ్వు వస్తున్న సంగతి ఆయనతో మాట్లాడాను. 'మీ అన్నయ్య పది రోజులు నాతో వుండాలనుకుంటే ఆ మాట నువ్వొచ్చి చెప్పడం ఏమిటి' అని దెబ్బలాడి; రమ్మని ఆహ్వానిస్తూ నీకు మెసేజి ఇస్తానని నీ అడ్రస్ రాసుకున్నారు. ఈపాటికి అదీ అందే ఉంటుంది. ఈ రెండు ఏర్పాట్లలో ఏది నీకు బావుంటుందో ఆలోచించుకుని ఆ ప్రకారం చేసుకో"

అది; మా తమ్ముడు నాకు రాసిన ఉత్తరం సారాంశం.

ఆ ఉత్తరం అందిన ఒక గంటకి "వెల్కమ్" అని ఒక్కమాటతో లక్ష్మణరావు టెలిగ్రాం అందింది.

రైలు సికింద్రాబాదు స్టేషన్‌కి తెల్లారగట్ట అయిదింటికే చేరింది. ఆటో మాట్లాడుకుని హిమాయత్‌నగర్ వెళ్ళాను. డోర్‌నెంబరునిబట్టి ఆ ఇల్లు కనుక్కోడానికి చేసే ప్రయత్నంలో నా మాటల్ని పట్టుకున్న ఆటో డ్రయివర్ "ఎమ్మెల్లేసాబ్ మకానా, సార్?" అని అడిగి తెలుసుకుని; ఆ తరవాత నేనేం ప్రయత్నం చెయ్యక్కర్లేకుండా తిన్నగా ఆ ఇంటి గేటుదగ్గర ఆటో ఆపేడు.

టైమ్ అయిదున్నర కావస్తోంది.

చలికాలం.

ఇంకా పూర్తిగా తెల్లారలేదు.

సామాను కిందనే వుంచి మేడమెట్లు ఎక్కేనుగాని; లోపలున్నవాళ్ళు నిద్దర్లు లేచినట్టు ఏ

చప్పుడూ సడీ వినబడకపోవడంతో కిందికి దిగాను. ఆ రెండు నిమిషాలూ వినబడుతూనే వున్నా నా చెవుల్లో దూరని ఒక నాదం అప్పుడు స్పష్టం అయింది.

తంబురాశృతి,

హిందూస్తానీ సంగీతం,

గాత్ర సాధన,

భూప్ రాగం ...

- ప్రాణాలు తోడేస్తోంది. అన్ని మర్యాదలూ అతిక్రమించి తలుపుకొట్టి ' అయ్యా, నన్ను కొంచెం సేపు మీ సమక్షంలో కూర్చోనివ్వరా?' అని అడిగెయ్యాలనిపించినంత ఆకర్షణ. డిస్టర్బ్ చెయ్యడం నేరం అనిపించేటంత మాధుర్యం.

నిశ్శబ్దంగా సామాను మేడమెట్లకిందికి చేర్చేను. రోడ్డుమీద తిరిగేవాళ్ళకి కనబడదని రూఢి చేసుకున్నాను. గేటు తలుపుకి వేసిన గడియ, కొక్కెం సమంగా వున్నాయో లేదో చప్పుడు చెయ్యకుండా నిర్ధారణ చేసుకున్నాను.

వెనకవేపున్న గదిలోంచి సన్నంగానే అయినా స్పష్టంగా వినిపిస్తున్న ఆ నాదాన్ని మరింత దగ్గిరగా చేరి వినాలని నా తాపత్రయం. ఒక్క నిమిషం మేడమెట్ల దగ్గర నించుని విన్నాను. గాత్రసాధన చేస్తున్న వ్యక్తి ఏదో "ఐసా వైసా" గాయకుడు కాదని; ప్రతి గమకం, అకార విశ్లేషణం చెబుతున్నాయి. ఆయన పేరు తెలిస్తే బావుండుననిపించింది. నింపాదిగా కదిలేను. వారి వాటా ద్వారం దగ్గర, కాలింగ్‌బెల్ స్విచ్ పక్కని వెతికేను. వరండా గ్రిల్లుకి తగిలించిన బోర్డుమీద వున్న పేరు నాకేమీ "క్లూ" ఇవ్వలేదు.

"ఎస్. నూరున్నీసా; ఎం.ఏ.ఎల్.ఎల్.బి., అడ్వకేట్ - ఎ.పి.పి."

మేడ మెట్ల పక్కనించి బిల్డింగు వెనకవేపుకి చేరడానికి వీలుగా ఆరడుగుల వెడల్పున ఒక సందుంది. ఆ సందులోంచి పాతిక అడుగులు వేసేక అక్కడొక సిమెంటు బెంచి కనబడ్డది. దానిమీద చతికిలపడ్డాను. శ్రవణానందం చేరువైంది. ఏకాగ్రత కోసం కళ్ళు మూసుకున్నాననుకుంటాను.

"ఎక్స్‌క్యూజ్మీ - కోన్ హై?"

కళ్ళు తెరిచేను.

ముప్పయ్యైదు - నలభై ఏళ్ళ స్త్రీ.

లేచి నుంచున్నాను. "నమస్తే. సారీ ఫర్ ది ఇంట్రూజన్. అయామ్ వెంకటరావ్; ఫ్రమ్ మచిలీపటామ్; గెస్ట్ ఆఫ్ ఎమ్మెల్యే లక్ష్మణరావ్" అన్నాను.

"గానా సున్ రహేహై, క్యా?" నవ్వింది. "అందర్ ఆజాయియే న? దర్‌వాజా ఖులా హై"

"సారీ మేడం; అండ్ థేంక్యూ. నేను ఇప్పుడే రైలు దిగొచ్చాను. లక్ష్మణ్‌రావింకా నిద్ర లేవలేదు. లగేజి స్టేర్‌కేస్ దగ్గరుంది. జస్ట్ మ్యూజిక్. ఇంకేం వద్దు. థాంక్యూ"

"ప్లీజ్ యువర్‌సెల్ఫ్" అని ఆమె వెళ్ళిపోయింది.

✣ ✣ ✣

సాయంకాలం అయిదున్నరకి సెక్రెటేరియట్‌లోంచి ఆ రోజుకి బైటపడ్డాను.

"నేను సాయంకాలం ఉప్పల్ వెళ్ళాలి. వచ్చేటప్పటికి ఆరున్నర- ఏడు కావచ్చు. నువ్వుగానీ ముందుగా వొచ్చేస్తే ముందు తలుపు తాళం ఇదుగో ఈలెటర్ బాక్సుకింద ఈ రెండు చెక్కలకీ మధ్య టక్‌చేసి వుంటుంది; తీసుకొని లోపలికొచ్చెయ్యొచ్చు. ఆరున్నరకి యాదగిరి వస్తాడు. వాడిదగ్గర లోపలి గదుల తాళాలుంటాయి. అంతవరకు హాల్లో కూర్చోగలవనుకుంటాను." అన్నాడు లక్ష్మణరావు.

అయినా అతను లేనప్పుడు ముందు తలుపు తాళం మాత్రం నేనెందుకు తెరవాలి- ఏడుగంటలయ్యే దాకా ఏ ట్యాంక్‌బండ్ దగ్గరో గడిపేస్తే మంచిది అనుకున్నాను.

నాలుగడుగులు నడిచేసరికి హిమాయత్‌నగర్ వెళ్ళిపోదామా అనిపించింది. ఆ భూప్‌రాగం పగలంతా చెవుల్లోనే వుండిపోయింది. ఈ గంటవ్యవధిలో కిందివాటా వాళ్ళని పలకరించి ఆ రాగం పాడిన వ్యక్తిని పరిచయం చేసుకోవచ్చునేమో! అతను ఈ వేళప్పుడు ఇంట్లోనే వున్నాడేమో? తెల్లారగట్ట భూప్‌రాగం పాడేడు. ఇప్పుడేదైనా 'సాయంకాల రాగం' ఆలాపిస్తున్నాడేమో? వెళ్తే అది వింటూ కూర్చోవచ్చుకదా!

మరో నాలుగడుగులు వేసేసరికి ఆకలి గుర్తొచ్చింది. మధ్యాహ్నం మూడు గంటలకి ఆ డిప్యూటీ సెక్రెటరీ గారు తెప్పించి ఇచ్చిన టీ ఘోరంగా వుంది.

టిఫిన్ తింటూ వుండగా మొహమాటం బయల్దేరింది. వాళ్ళు లక్ష్మణరావుతో బాటు ఆ ఇంట్లో వుంటున్నారు. కనక నా అంతట నేను వెళ్ళి పలకరించి పరిచయం కోరడం అంత సభ్యత కాదేమో! మహమ్మదీయ కుటుంబం. ఆ నూరున్నీసా అనే ఆవిడ అడ్వకేట్‌గా అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నలుగుర్లోకి వస్తున్నా; మిగిలినవాళ్ళకి ఘోషాలాంటి నియమాలున్నాయేమో?

లక్ష్మణరావు ఇంటికి చేరేక వాళ్ళని పరిచయం చెయ్యమని అడగడం మంచిదిలా వుంది.

అలా, ట్యాంక్‌బండ్ వేపుకూడా వెళ్ళకుండా బిర్లామందిర్ వేపు తిరిగిపోయి ఏడుంబావుదాకా గడిపి అప్పుడొక ఆటో ఎక్కి ఆ ఇల్లు చేరేను.

✣ ✣ ✣

"రా, రా! నీ కోసమే చూస్తున్నాను. ఎక్కడ తిరుగుతున్నా వింత రాత్రిదాకాను? కమాన్. సిడౌన్ అండ్ జాయిన్ అజ్. వీరు నర్సారెడ్డిగారని వరంగల్‌లో బిజినెస్ చేస్తారు. ఆయన కమ్లాకర్; ప్రాక్టీసింగ్ డాక్టర్; దిల్‌సుఖ్‌నగర్. అండ్, మేడమ్ వసంతా; ది ఫేమస్ సోషల్ వర్కర్."

అందరికీ నమస్కారాలు చెప్పేను. 'వెంకట్రావు నాక్లాస్మేటు. బందర్‌లో ఒక ఇండస్ట్రీ వుంది. దాన్ని ప్రైవేట్ లిమిటెడ్ చేసి వృద్ధి చేద్దామని ప్రాజెక్ట్ రిపోర్టుల్తో వొచ్చాడు. సెక్రెటేరియట్‌లోనూ ఇండస్ట్రీస్ కమిషనరేట్‌లోనూ పన్లున్నాయి. వెరీ నైస్ జంటిల్మన్' అంటూ "నాకు క్లాస్మేట్సంటే భయం. వాళ్ళ పన్లు చేసుకోడంలో నన్నెక్కడ కలగజేసుకో మంటారో అని" నన్ను వాళ్ళకి పరిచయం చేసి తన హాస్యధోరణికి తానే నవ్వుకోడంలో పడ్డాడు లక్ష్మణరావు.

"ఆయన అడక్కపోతే మాత్రం మీరు కలగచేసుకోకుండా ఊరుకుంటారా?"

"అంతేలెండి. లేకపోతే అయిదురోజుల పని అంటూ వచ్చిన మనిషి పదిహేను రోజులు నా నెత్తిమీద కూర్చుంటాడు. అఫ్‌కోర్స్; వెంకట్రావు ఎన్నాళ్ళున్నా నాకు సరదాగానే వుంటుందనుకోండి. ఈయన అందరు క్లాస్మేట్స్ వంటి వాడు కాదు; అరె, నిలబడే వున్నావేంటోయ్? ఒరే, యాదగిరీ! ఈ సార్‌కి కుర్చీ వెయ్యవేంరా? జల్దీ ఓ గ్లాస్ కడుక్కొచ్చి పెట్టిక్కడ"

'కుర్చీ అయితే వెయ్యనీ గాని-గ్లాసు అక్కర్లేదు. నేనిప్పుడే వస్తాను; ఎక్స్‌క్యూజ్‌మీ' అని చెప్పేసి లోపలి గదివేపు వెళ్ళేను.

సరిగ్గా ఆ గదికిందనే, కింది వాటాలో గాత్రసాధన చేసే ఆయన ఉన్నట్టుంది.

శబ్దానికి వున్న గుణం- మీదికి ప్రసరించడం.

నాదానికి వున్న లక్షణం- చెవుల్లోంచి మనస్సులోకి ప్రవేశించడం.

మళ్ళీ భూప్ రాగమే.

బట్టలైనా మార్చుకోకుండా, సందువేపున్న కిటికీ పక్కకి చేరి, కిటికీ ఊసలు పట్టుకుని నుంచుని అలా వుండిపోయాను. నా వీపుమీద లక్ష్మణరావు చెయ్యిపడేదాకాను.

"నేను మీ తమ్ముడికి ముందే చెప్పేను; ఈ న్యూసెన్సు భరించే ఓపిక నీకుంటే ఈ ఇంట్లో నువ్వు ఎన్నాళ్ళయినా వుండొచ్చని. ఇంకా ఇప్పుడే ఏమైంది? రాత్రికి వుంది నీ పని. అందులోనూ నేను బైటికెళ్తున్నానని తెలిసిపోతుంది. కనక ఇంకా విజృంభిస్తాడు. పదపద "

అతనితో నడుస్తున్నాను.

ముందు హాల్లో వాళ్ళు నించుని వున్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూనే వున్నాడు. 'సర్లె. నేను బైటికి పోతున్నాను. యాదగిరీ! ఇవన్నీ సరిగా సర్దేసి ఈ అయ్యగారికి భోజనం తెచ్చి ఆయన తిన్నాక నువ్వూ తిని ఇక్కడే పడుకో. తెల్సిందా ? వస్తాను, వెంకట్! నేను బహుశా రాత్రికి రాకపోవచ్చు'

నాలుగు జతల చెప్పులు మెట్లు దిగడం, ఇనపగేటు తెరుచుకోడం, కారు స్టార్టవడం ఇవన్నీ 'శబ్దాలు'. భూప్‌రాగం వినపడనంత దూరంలోంచి మధురతరంగా చేసేది: 'నాదం'.

"యాదగిరి! నాకు భోజనం వద్దు. నువ్వెళ్ళి తినిరా" అని చెప్పేసి లోపలి గదిలోకి పరుగెత్తాను.

✣ ✣ ✣

డిప్యూటీ సెక్రటరీ నాగభూషణరావుగారు నాతో స్వయంగా ఊళ్ళో తిరిగి; పరిశ్రమల కమిషనర్ ఆఫీసులోను, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫీసులోను తన పలుకుబడి ఉపయోగించి - నాలుగో రోజుకల్లా నా పనిని ఒక కొలిక్కి తెచ్చేరు. ఆ రోజు మేం ఊళ్ళో పనులు చూసుకుని ఆయన రూంకి వచ్చేసరికి మధ్యాహ్నం మూడున్నర కావస్తోంది. "నువ్వు ఓ అరగంట ఎక్కడైనా తిరిగొస్తావో, లేకపోతే ఈ ఔటర్ రూంలో కూర్చుంటావో; నీ ఇష్టం. నాకో చిన్న ఎన్‌క్వయిరీ వుంది." అని ఒక్కడూ తనరూంలోకి వెళ్ళాడు నన్ను ఔటర్ రూంలో వదిలి.

అక్కడ ఒక సోఫాలో ఒక స్త్రీ కూర్చుని వుంది.

ఆమె-

నేను హైదరాబాదు చేరిన నాటి తెల్లవారుజామున నన్ను పలకరించి సంగీతం వినేటట్టయితే లోపలికి రమ్మని ఆహ్వానించిన ఆవిడ. ఎమ్మెల్యే లక్ష్మణరావు వున్న ఇంట్లో కిందివాటాలో వుంటున్న నూరున్నీసా, ఎడ్వకేట్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్.

ఆవిడతో ఏదో మాట కలిపి 'ఆ' గాయకుడి వివరాలు తెలుసుకోవాలని ఒక ఆలోచన వచ్చింది.

నేనింకా ఏమీ నిర్ణయించుకోకముందే లోపల్నించి ఒక ఎటెండర్ వచ్చి ఆమెని రమ్మన్నట్టు

సంజ్ఞ చేశాడు. ఆవిడ లేచి నాగభూషణరావుగారి చాంబర్సులోకి వెళ్ళింది.

స్టెనో టైపిస్టు కుర్చీకి వెనకగా వున్న బజర్ మోగింది. అతను "ఎస్సార్" అని చిన్న కేకలాంటిది వేసి హడావుడిగా లోపలికి వెళ్ళేడు.

నేను ఖాళీగా వున్న ఆ సోఫాలో కూర్చుంటూ వుండగా టైపిస్టు టేబిల్ మీదినుంచి ఒక కాగితం ఎగిరొచ్చి నా ముందు పడింది. దాన్ని మళ్ళీ ఆ టేబిల్‌మీద పెట్టేద్దామని వంగి తీశాను. కానీ సోఫాకి ఎదురుగా వున్న టీపాయిమీద పెట్టొచ్చులే అనిపించి ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుని సోఫాలో చతికిల పడ్డాను.

సంగీతం ఆకర్షించినట్టే అక్షరాలు కూడా నన్ను ఆకర్షించేయి.

రెండు పేజీలు వుంది ఆ మేటర్. అది కార్బన్ కాపీ. దాని ఒరిజినల్ స్టెనోగారు లోపలికి పట్టుకెళ్ళిన కాగితాల్లో వుండి వుంటుంది.

చదివేశాను...

ఫలానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయిన శ్రీ లక్ష్మణరావుగారికి ఎమ్మెల్యే క్వార్టర్సులో వసతి చూపించలేకపోయిన కారణంగా ప్రభుత్వం లీజులో వున్న భవనాల్లో ఒకటి అయిన ఫలానా డోరు నెంబరుగల ఇంట్లో మేడమీది భాగం వారికి ఎలాట్ చేయడమైంది. సదరు భవనంలో క్రిందిభాగం ఎ.పి.పి. శ్రీమతి నూరున్నీసా గారికి ఎలాట్ అయి వుంది.

ఫలానా తేది గల ఎమ్మెల్యేగారి రిపోర్టు ప్రకారం, సదరు భవనం క్రిందిభాగంలో వుండేవాళ్ళ వలన తమకు చాలా డిస్టర్బెన్సుగా వుందని పేర్కొనడమైనది. రాత్రనక, పగలనక, క్రిందిభాగంలో వారు "గానా బజానా" చేస్తున్నారని, తరుచు తంబూరా, తబలా వంటి వాద్యాల సమ్మేళనంతో విపరీతమైన ధ్వనులు చేస్తున్నారని; ముఖ్యంగా అర్ధరాత్రివేళ, తెల్లవారుజామువేళ ఆ ధ్వనులు పరిపాటి కావడంచేత తమకు నిద్రాభంగం కావడమేకాక, తమను చూడవచ్చిన ఓటర్లు తదితరులు ఆ ధ్వనులను ఆపలేకపోయి నందుకు తమ అనిష్టతను అవహేళనను వ్యక్తపరిచే సంఘటనలు జరిగాయని ఎమ్మెల్యేగారు తమ రిపోర్టునందు పేర్కొనియున్నారు.

సదరు కారణాల నేపథ్యంలో శ్రీ ఎమ్.ఎల్.ఎ. గారు తమకు ఎమ్మెల్యే క్వార్టర్సులో వసతి ఇచ్చినా సరే, లేదా సదరు నూరున్నీసా గారికి వేరే చోట వసతి చూపించినా సరే అని ప్రతిపాదించినారు.

ఈ విషయమై నిజానిజాలు భోగట్టా చేసుకొని రమ్మని ఫలానా అధికారిని కోరగా వారు సమర్పించిన నివేదిక ఈ ఫైలులో ఫలానా పేజీవద్ద ఫైలు చేసి ఫ్లాగ్ చేయడమైనది.

అధికారులకు ఎలాట్ చేయగల వసతి గృహాల విషయంలో ప్రస్తుతం నెలకొని వున్న కొరత దృష్టిలో వుంచుకొని ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించే నిమిత్తం సదరు భవనంలో క్రింది భాగంలో వుంటున్న ఎ.పి.పి శ్రీమతి నూరున్నీసా గారిని ఒకసారి వచ్చి మాట్లాడవలసిందిగా కోరుచూ వారికి వ్రాసిన ఫలానా తేదీగల లేఖ (చూ॥ ఫలానా పుట) ప్రకారం సదరు నూరున్నీసా గారు వచ్చినందున ఈ ఫైలు యావత్తున్ను పంపించుకొంటూ ఇందలి ముఖ్య విషయాలను ఈ నోట్ ద్వారా సంక్షిప్తంగా శ్రీవారి దృష్టికి తేవడమైనది.

✤ ✤ ✤

"ఎంతో అభిమానంతో, మరెంతో శ్రద్ధతో నా పనులన్నీ చేసి పెట్టేరు. మీకు ఎలా కృతజ్ఞతలు

చెప్పాలో తెలియడంలేదు" అన్నాను.

'మర్చిపోండి అలాంటి మర్యాదలు. నాకు చిన్నప్పుడు అక్షరాభ్యాసం చేసిన గురువుగారి పుత్రులు మీరు. మీకు నేను చేసిందేమీలేదు. ఒకవేళ ఏమైనా చేసున్నా అది మా గురువుగారి ఋణం తీర్చుకోడంలో ఒక భాగం మాత్రమే అని నా ఉద్దేశం. అంచేత అలాటి మర్యాదలేం వద్దు.' అన్నారు నాగభూషణరావు గారు.

"అలాంటి మర్యాదలు వద్దంటున్నారు. సరే పోనీండి. నేను నిన్న మీ ఇంటికొచ్చి నప్పుడు చూసేను మీరు పోగుచేసిన హిందూస్తానీ సంగీతం కేసెట్లు. బడే గులాం నుంచి గులాం ఆలీవరకు మీరు ఎవర్నీ మిస్ కాకుండా మీ బీరువాలో బంధించేరు. మీకు జ్ఞాపకం వుందో లేదో మనం మొట్టమొదట కలుసుకున్నది మెహదీ హసన్ ఇక్కడ నిజాం క్లబ్‌లో పాడిన నాడు..."

'అవునవును. ఆ రోజు నువ్వు డి.ఐ.జి. ప్రసాదరావుతో కలిసి వచ్చేవు. నాకెందుకు గుర్తులేదు!?'

"అయ. అలాంటి కంఠస్వరంలో, ఘజల్స్ కాక పచ్చి శాస్త్ర కట్టుసంగీతం వినిపించే చోటికి మిమ్మల్ని తీసికెళదామని వుంది. కనీసం ఈ మర్యాద అయినా నన్ను చెయ్యనిస్తారా?"

నాగభూషణరావుగారు సాలోచనగా చూసేడు. 'ఇవాళ వుందా, ఏదైనా కాన్సర్ట్?'

"టుడే అండ్ ఎవ్విరిడే"

"అంటే?"

"నిజానికి అదేం కాన్సర్ట్ కాదు. ఎంత గౌరవంగా ఉదహరించవలసొచ్చినా అది కేవలం ప్రాక్టీస్ అంటే సాధన మాత్రమే అని ఒప్పుకోక తప్పదు. నాలుగు రోజులైంది సార్... భూప్‌రాగం ఆలపిస్తున్నాడు. రాత్రి లేదు, పగలులేదు, తెల్లారగట్ట అనిలేదు. అప్పుడెప్పుడో శాంతారామ్ 'అమర్ భూపాలి' అని సినిమా తీసి భూప్‌రాగం పాడిన ఒక విద్వాంసుడి చరిత్రని తెరకెక్కించేడట. శాంతారామ్ ఇప్పుడు బ్రతికుంటే మళ్ళీ మరో సినిమా తీసేవాడేమో అని నాకనిపిస్తుంది. నవ్వకండి. శాంతారామ్ తన పెర్ఫార్మెన్స్ తనకే నచ్చని తరహా ఆర్టిస్టుల్లో ఒకడు. 1942లో ఒకసారి శాకుంతలం నాటకాన్ని తెరకెక్కించి అంతకన్నా గొప్పగా తీద్దామని 1960లో మళ్ళీ స్త్రీ - అని ఇంకో సినిమా తీసేడు కదా. అందుకు అంటున్నాను."

"అయితే వినవలసిందే. పరిణతి చెందిన ఆర్టిస్టు చేసే సాధన కచేరీ కంటే కూడా ఎక్కువ తృప్తినిస్తుంది. వెళదామంటావా?"

"వెళదాం అనే కదా, నేనంటున్నది?"

"మనల్ని రానిస్తారా - అని నా అనుమానం. చాలా మంది విద్వాంసులు తాము సాధన చేసేటప్పుడు ఎవర్నీ రానియ్యరు; తెలుసా?"

"అదంతా నేను చూసుకుంటానుగా!"

"ఇంతకీ ఆ గాయకుడి పేరేమిటి? అహ, నేనెప్పుడైనా విని వుంటానేమోనని."

"నిజం చెప్పాలంటే నాకతని పేరు తెలీదు. అందుకు నన్ను మీరు క్షమించాలి."

✣ ✣ ✣

ఆ ఇంటి దగ్గర కారు ఆపించాను. 'మీరు కార్లోనే వుండండి. నేనిప్పుడే వస్తాను' అని గేటు తెరిచి కింది వాటావారి కాలింగ్ బెల్ బటన్ నొక్కాను., "ఆ రహీహై" అని జవాబు. పది సెకండ్లలో

ఆమె- నూరున్నీసా...

"ఎక్స్‌క్యూజ్‌మి; నన్ను గుర్తుపట్టారని ఆశిస్తాను. నాన్నగారి దర్శనం కోసం ఒకర్ని తీసుకొచ్చేను."

ఆమె నా పక్కగా వంగి రోడ్డు మీద వున్న కారును చూసింది. 'ఓ.కె. అబ్బాజాన్‌కీ చెప్తాను.' అని తలుపు తెరిచే వుంచి లోపలికి వెళ్ళింది.

డ్రైవర్‌వచ్చాడు. "సార్ పిలుస్తున్నారండి. తమర్ని.

నాగభూషణరావుగారు స్వయంగా కారు తలుపు తెరిచి పట్టుకుని "ఎక్కు, మళ్ళీ వద్దాం" అన్నాడు.

"అది కాదు సార్! ...."

"మనం ఎక్కడికొచ్చేమో నాకు తెలిసిపోయింది. రా, ముందు కారెక్కు చెప్తాను.'

✤ ✤ ✤

'నువ్వు మా గురువుగారి అబ్బాయి కాకపోయుంటే దీన్ని ఎంతో సీరియస్‌గా తీసుకునేవాణ్ణే.' అన్నాడు నాగభూషణరావుగారు; హెూటల్లో ఆర్డరిచ్చిన రవ్వదోసె కోసం ఎదురుచూస్తున్న సమయంలో.

"ఐ యామ్ సారీ. నేనేదైనా పొరపాటు పని చేసేనా?" అన్నాను.

"తెలిసి చేసుండవని నమ్ముతున్నాను. ఎనీవే, నోటితో చెప్పడమెందుకు?" అని తన పక్క కుర్చీలో వుంచిన ఆ ఫైలు విప్పి అన్నిటికన్నా పైన వున్న కాగితం ఒక్కటే ఊడతీసి "చదువు; నువ్వేం చెయ్యబోయావో నీకు తెలుస్తుంది." అన్నాడు.

"-ఎమ్మెల్యే లక్ష్మణరావుగారు ఉదాహరించిన న్యూసెన్సు గురించి ఈ దిగువ రిమార్కులు ఇవ్వడమైంది :-

శ్రీమతి నూరున్నీసా, అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రెండేళ్ల క్రిందట తమకు స్వంత ఇల్లు ఏదీ లేదని ధ్రువపత్రం జతపరచి ప్రభుత్వ క్వార్టర్సు గాని లీజు వసతిగాని ఇమ్మని అడిగినందున ఫలానా డోరునెంబరు గల భవనంలో క్రిందిభాగం ఆమెకు ఎలాట్ చేయడం జరిగింది. తనకు ఎలాట్ చేసిన ఈ ఇంటి భాగంలో సదరు నూరున్నీసాగారు తన తల్లిదండ్రులతో వుంటున్నారు. ఈమెకు భర్తలేరు. ఒక ఆడపిల్ల మాత్రం వుంది.

ఈ ఇంటి భాగంలో సదరు నూరున్నీసా గారితో వుంటున్న ఆమె తండ్రి శ్రీ మొయినుద్దీన్ అనే వ్యక్తియే ఎమ్.ఎల్.ఏ. లక్ష్మణరావుగారు సూచించిన న్యూసెన్సుకు, డిస్టర్బెన్సుకు కారకుడని మా విచారణలో తేలింది. సదరు మొయినుద్దీన్‌గారికి ఈ నగరంలోనే, ఇంకా స్పష్టంగా చెప్పాలంటే బొలారమ్ ప్రాంతంలో ఒక స్వంత భవనం వున్నదనీ; సదరు మొయినుద్దీన్ గారికి పుత్రసంతానం లేని కారణంగా సదరు భవనం ఎన్ని విధాల ఆలోచించినా శ్రీమతి నూరున్నీసా గారికి చెందేదే అనీ మా విచారణలో తేలినది.

స్వంత ఇల్లు లేదని ధ్రువపత్రం సమర్పించినందుకు; లేదా ఎమ్మెల్యే లక్ష్మణరావు గారు, ఆ దిగువ సంతకం చేసినవారి వరకు పెద్ద మనుషులు ఎందరు నచ్చజెప్పినా ఇక్కడ సంగీత సాధన ద్వారా కలిగే న్యూసెన్సు ఆపడానికి ఇష్టపడనందుకు, శ్రీమతి నూరున్నీసా గారి పేరిట వున్న ఈ

ఎలాట్‌మెంటు వెంటనే రద్దుచేయడం శ్రేయస్కరమని భావించడమైనది."

✤ ✤ ✤

"అమర్ భూపాలి అన్నావు - కదూ?"

"ఎస్, సార్."

" ఆ పిక్చర్ నువ్వు చూసేవా?"

"నేనింకా అప్పటికి పుట్టలేదండి"

"నిజమే. నువ్వు పుట్టాక ఆ సినిమా రెండో రౌండు ఆడడానికి రాలేదు కూడా."

"ఇంతకీ మీరు చూసేరాండీ ఆ పిక్చర్?"

"చూశాను గనకే చెప్తున్నాను. భూప్‌రాగం పాడిన ఒక మహా విద్వాంసుడు అసూయాద్వేషాల కారణంగా హత్యచేయబడతాడు; ఆ సినిమాలో."

"అయ-"

"మీ మొయినుద్దీన్ గారు ఇల్లు మారతాడు అంతే. సంతోషించు!" అన్నాడు నాగభూషణరావు గారు.

❊

*( "స్వాతి" వీక్లీ : 23-8-91 )*

ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు వోలేటి వెంకటేశ్వర్లు గారికి " కచేరీలు చెయ్యడం" కన్నా " సాధన చెయ్యడం " ఎక్కువ ఇష్టంగా ఉండేది. వారు తమ చివరి రోజుల్లో తిరుపతిలో ఉండేవారు. అప్పట్లో : తాము తిరుపతిలో నిర్వహించే ఒకానొక కవి-కథక-సమ్మేళనంలో పాల్గొన వలసిందిగా నాకు కడప రేడియో స్టేషన్ నుంచి పిలుపు వచ్చింది. ఆ ట్రిప్పులో నేను వారిని పలకరించినప్పుడు ఆయన తమ సంగీత సాధనకి సంబంధించిన ఒక ఉదంతం చెప్పేరు. దానికి, నా కల్పనాకుతూహలానికి, శాంతారాం గారి "అమర్ భూపాలి" సినిమా జ్ఞాపక గర్వం చేర్చి ఈ కథ రాసేను.